# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-06-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని పలు స్థానిక సంస్థలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈరోజు ఎన్నికలు నిర్వహించనుంది.**
2. **తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నాయి.**
3. **పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**
4. **దేశ ప్రజలకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు.**
5. **నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలును కేంద్ర ప్రభుత్వం భారత ఆహార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న తిరువూరు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్, మాచర్ల పురపాలక సంఘం ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, నిడదవోలు వైస్ ఛైర్ పర్సన్ పదవులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ రోజు ఎన్నికలు నిర్వహించనుంది. ఎన్నికల కోసం ఆయా స్థానిక సంస్థలు ఈ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తెలిపింది. ఈ మేరకు ఆయా పురపాలక, నగర పంచాయతీలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు, శాసన సభ్యులకు, శాసన మండలి సభ్యులకు జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారులకు ఎన్నికల సమాచారం ఇచ్చింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 4వ తేదీన వేడుకలు నిర్వహించాలని జనసేన పార్టీ అధ్యక్షులు ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. సుపరిపాలనకు ఏడాది పేరుతో.. వేడుకలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. "జూన్ 4న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాలని, సాయంత్రం ఇళ్ల ముందు దీపాలు వెలిగించాలని కోరారు. ఈ వేడుకల్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి, విస్తృతంగా ప్రచారం చేయాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలు నిరోధించేందుకే రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా బొండపల్లిలో నూతన రేషన్ దుకాణాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలు పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలని కోరడంతో ఈ వ్యవస్థను పునరుద్ధరించినట్లు నిర్ణయించామన్నారు. 65 ఏళ్ల పైబడిన వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందజేస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్..31 సెకన్లు

-------------------------

తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నాయి. హైదరాబాద్ లోని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి జపాన్ లోని కితాక్యూషూ నగర మేయర్ కజుహిసా టకేచీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం పాల్గొంటారని అధికారులు తెలిపారు. అనంతరం కితాక్యూషూ బృందంతో తెలంగాణ ప్రభుత్వం పరస్పర సహకార ఒప్పందాలపై సంతకాలు చేయనుంది.

-------------------------

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఈరోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తారు. ఈరోజు ఉదయం పరేడ్ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కస్తారు. పోలీసు సిబ్బందికి అవార్డులను ప్రదానం చేస్తారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, సచివాలయం పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్వహించే వేడుకల్లో రాష్ట్ర మంత్రులు పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చార్మినార్, సచివాలయం, అమరజ్యోతి స్తూపం, అంబేద్కర్ విగ్రహం, గోల్కొండ వంటి ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో విద్యుత్ దీపాల కాంతులను ఏర్పాటుచేశారు.

ఇదిలా ఉండగా తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న రాష్ట్రం పదకొండేళ్లు పూర్తిచేసుకుని పన్నెండో సంవత్సరంలో అడుగుపెడుతోందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచేలా సరికొత్త విధానాలతో.. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి , బిఆర్ఎస్ అధ్యక్షులు కె. చంద్రశేఖర రావు తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనతికాలంలోనే తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపామని, అదే స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజల జీవనవిధానం మెరుగయ్యేలా పాలనను అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు.

-------------------------

పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అమరావతి, పోలవరం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు

బనకచర్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..28 సెకన్లు

---------------------------

ఉగ్రవాదాన్ని నిర్మూలించే విషయంలో భారతదేశం తన నిబద్ధతను చాటుకునే ప్రయత్నంలో భాగంగా ప్రపంచ దేశాలలో 7 అఖిల పక్ష ఎంపీల బృందాలతో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఇంగ్లండ్‌లోని లండన్‌లో పర్యటిస్తున్నబిజెపి ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిల పక్ష బృందం లండన్‌లో ఆ దేశ విదేశాంగ కార్యదర్శి ప్రీతి పటేల్ తో సమావేశమైంది. ఈ సందర్భంగా సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ వైఖరి, చర్యల గురించి అఖిల పక్ష బృందం వివరించింది.

మరోవైపు.. సుప్రియా సూలే నేతృత్వంలోని అఖిల పక్ష బృందం గతసాయంత్రం ఇథియోపియాలో పర్యటించింది. ఈ సందర్భంగా సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేపట్టిన చర్యలపై ఆ దేశ నాయకులకు వివరించింది.

కాగా విదేశాల్లో అఖిలపక్ష బృందాల పర్యటనపై విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

దేశ ప్రజలకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన బిజెపి శ్రేణులతో నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ...

..వాయిస్.. 29 సెకన్లు

---------------------------

పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలును కేంద్ర ప్రభుత్వం భారత ఆహార సంస్థ –ఎఫ్‌సీఐ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీ వంటి కీలక అంశాలను పర్యవేక్షించే ఎఫ్‌సీఐ కమిటీకి శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వం వహించనున్నారు. ఈ హోదాలో ఆయన రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, ధాన్యం సేకరణ ప్రక్రియ, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఇతర పంటల ఉత్పత్తుల సేకరణ, ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాల అమలు తీరు వంటి అనేక అంశాలపై అధ్యయనం చేయనున్నారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ...

వాయిస్...26 సెకన్లు

తెలంగాణలో రానున్న రెండు రోజులపాటు ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================